# ★ కచేరీ కథ ★

మారేమండ రామారావు

మూర్తి స్వశక్తివల్లనే తన్నెదుర్కొంటున్న ప్రతీ సమస్యనీ యిప్పటి దాకా ప్రతిఘటిస్తూ తన ఉద్యోగాన్ని నిలబెట్టుకుంటూ వచ్చాడు. తన చుట్టూ మూగివున్న జంబుకాలు శత్రుశక్తితో తనను ప్రతీ అడుగునా, అహర్నిశాలూ, అనుక్షణం అణిచేద్దామనే తతంగం జరుపుతున్నా చలించలేదు.

చాలా కష్టపడి పని చేస్తాడు. సరిగ్గా టైముకు వచ్చి, విశ్రాంతిని ఆశించకుండా పగలల్లా పని చేసి సాయంత్రంవేళ కాగానే లేస్తాడు. ఇంటికి పోతాడు. పగలు ఆఫీస్‌లో పని చేయవలసిన టైమంతా యింటివద్ద గడపి, నిద్రపోయి, షికార్లు కొట్టి సాయంత్రం నాలుగు సందులూ ముల్లు పడ్డాక ఆఫీసుకువచ్చే అధికార్లకోసం అతడాగడు. తన కర్తవ్యం నెరవేర్చుకుని యింటికి పోతాడు.

అందరిలాగా ఆఫీసర్లను పొగడడు. వారి వెనకాల చేతులు నలుపుకుంటూ తిరగడు. టిఫిన్లు యిప్పించడం, వాళ్ల కుటుంబాల్ని సినిమాలకు తీసుకువెళ్లడం, టీపార్టీలు చెయ్యడం, యివన్నీ అతనికి చేతకావు. అతని శక్తికి మించిన పనులు కూడాను-లంచం యిచ్చి జీతం గాని, ఉద్యోగంగాని హెచ్చు చేయించుకోడు. ఇవే అతన్ని యింకా మునుపటి స్థానంలోనే ఉంచివేశాయి.

స్వాతంత్ర్యం అంటే యిష్టపడతాడు. ఒకళ్ల ఆగ్రహానుగ్రహాలమీద ఆధారపడి దైనందిన జీవితం గడపడం ఏహ్యంగా భావిస్తాడు-ఒకర్ని లక్ష్యం చెయ్యడు. అతనికా అవసరం లేదు కూడాను.

ఆ ఆఫీసులో అందరికంటె అతనికే ఎక్కువ పని. అయినా ఓపికతో చక్కగా పని చేస్తాడు.

యివన్నీ కారణంగా ఆ ఆఫీసు చాలామంది ఇతర గుమస్తాలకు అతనిమీద అసూయ, ఆగ్రహం, ఓర్వలేరు. కక్ష, కావేషాలతో వాళ్ల మనస్సులు మండిపోతూంటాయి. అవకాశం దొరికిన పక్షంలో అతన్ని అథఃపాతాళానికి అణిచేద్దామని గోతి పక్కనక్కల్లా కాచుకుని కూర్చుంటారు. ఏ పని వేళకు చెయ్యడా, నేరం ఆరోపిద్దామా? అని చూస్తుంటారు. వాళ్ళకు వేరే పని లేదు. మూర్తిని నాశనం చేద్దామని వాళ్లు కంకణం కట్టారు.

చాలాసార్లు ఆఫీసర్‌తో ఎన్నో కల్పించి చెప్పారు, నూరిపోశారు, కాని సరియైన మూలం దొరకకపోవడంవల్ల ఎవరూ అతన్ని ఏమీ చెయ్యలేకపోయారు.

ఉద్యోగస్థులు మూర్తిని చాలాసార్లు తమ యిళ్ళకు రమ్మని పిలిచారు. ఎందుకో మూర్తికి తెలుసు - వాళ్ళను పొగడడానికి. కావలసినవి సమకూర్చడానికి, వాళ్లుచెప్పిన ప్రతీ మాటకీ నవ్వుతూ బుర్ర ఊపి సమ్మతి తెలపడానికి, 'నా పనంతా ఆఫీసులో పూర్తి అయినప్పుడు, మీ యిళ్ళకు రావలసిన అవసరం నాకు లేద'ని ముక్తసరిగా జవాబిచ్చేవాడు. వెళ్లేవాడు కాదు.

అవకాశాలు చూసి మూర్తిమీద అయిదారు నేరాలు ఆరోపించారు. అవి చిన్నవి. అయినా కొండంతలు చేశారు. ఆఫీసర్‌ను ఆలోచించే అవకాశం లేకుండా చేశారు. ఎప్పుడూ గుమస్తాలకు దర్శనం యిస్తూ, వాళ్ళ మాటలు విని, వాళ్ళ దొంగకూడుమీద ఆధారపడి జీవితం గడిపే ఆఫీసర్ ఎదురు చెప్పలేక మూర్తిమీద ఆరోపింపబడ్డ నేరాలను ఖాయంచేసి చెడ్డగా వ్రాశాడు.

అయితే మూర్తి చలించలేదు. దానివల్ల మూర్తి మారిపోతాడని చాలామంది విశ్వసించారు. అతను మారకపోవడం సరికదా, యింకో పట్టు పట్టాడు. తనున్న చోటనే బలంగా స్థావరం ఏర్పరుచుకున్నాడు.

మూర్తికి సెన్సర్ యిచ్చారు, బ్లాక్ మార్కులు యిచ్చారు. ఎన్ని చేసినా ఆ క్రూర మృగాలమధ్య అతడు నెట్టుకు రాగలిగాడు.

ఇంచుమించు అందరు ఉద్యోగస్థులూ లంచాలు తీసుకోడం, కాఫీలకు పరుగెత్తడం, ఇంట్లో సామాన్లూ, ఫర్నిచర్‌లూ ఆత్మాభిమానాన్ని పూర్తిగా చంపుకుని ఒకళ్ళకు దాసులై పోవడం అందరకూ తెలిసినదే. మూర్తి వాళ్ళకు చాలా దూరాన, ఉన్నతంగా ఉండడం చేత, నైతికంగా చాలా శక్తికలవాడు కావడం చేత, వాళ్ళకు వచ్చేమామూళ్లు అడ్డిపోయాయి. వాళ్ళ పప్పులు ఉడకడం లేదు. అందరి పనులూ లంచాలు లేకుండానే అయిపోతుండడంవల్ల ఉద్యోగుల్ని బహూకరించే అవసరం లేకుండా పోయింది.

తన యింటికి సామాన్యంగా పంపబడే పారితోషికాలు ఆగిపోవడానికి కారణం ఆఫీసర్ గుమస్తాల్నడిగాడు. మూర్తే కారణమన్నారు. మూర్తిమీద కక్షకు ఆఫీసర్ మనసులో పునాది వేశారు.

ఆ ఆఫీసులో అందరికంటె కష్టపడి పని చేసినా, తను న్యాయమార్గానపోయి, యితరుల్ని మోసపుచ్చకుండా, తన ఆత్మాభిమానాన్ని అమ్ముకోకుండా ఉండడమే అతని ఉద్యోగపు హెచ్చింపుకు అనకట్ట అయిపోయింది.

ఆరోజు వ్రాతకోతలు పూర్తిచేసి మూర్తి, సంతకంకోసం ఆఫీసరుముందు కాగితాలు పెట్టాడు. అందులో రెండు వేర్వేరు కాగితాల మీద వ్రాసినదంతా ఒకే కాగితంమీద సరిపెట్టి ప్రభుత్వానికి కాగితం కొరత తీర్చకపోవడానికి కారణం అడిగాడు ఆఫీసరు వ్రాసినదానిమీద. సంతకం పెట్టకపోవడం సరికదా, మూర్తి ఎదటనే చించిపారేశాడు. మూర్తికి కోపం వచ్చింది. తను చేసినదాంట్లో తప్పు లేదు. మూడు రోజుల్లా రాత్రింబవళ్ళు కష్టపడి వ్రాసినదంతా ఒక్క నిమిషంలో ఆఫీసరు నిర్లక్ష్యంగా చించిపారేశాడు. అతనికి తన పని విలువ, కష్టం తెలియదు. ఒకళ్ళమీద దమాయింపు తెలుసు. లంచాలు తీసుకొని తనకుకూడా పంచి యిచ్చే ఉద్యోగుల చెప్పుడు మాటలు విని కష్టపడే అమాయకుల మీద చర్య తీసుకోవడం తెలుసు.

మూర్తి పట్టలేకపోయాడు. అయినా తన్ను తాను సంబాళించుకున్నాడు. ఆఫీసర్ ఆ కాగితాలు తిరుగా వ్రాయమన్నాడు. మూర్తి నిరాకరించాడు. ఆఫీసర్‌కు ఆగ్రహం వచ్చింది. తన ఆజ్ఞ పాటించాలన్నాడు. ఆ కాగితాలు వేర్వేరు తేదీల్లో వ్రాసినవనీ, అవి వేరే వేరే వెళ్లాలనీ, అందుచేతనే తనలా వ్రాయవలసి వచ్చిందనీ, ఆ సంగతి అడిగి ఆలోచించి తెలుసుకోకుండా ఏలా చేయడం చాలా తప్పనీ బోధపరిచాడు మూర్తి.

ఒకళ్ళచేత బుద్ధులు చెప్పించుకోవడం ఆఫీసర్‌కు చెల్లని పని. ఒకే పనికి సంబంధించినవి కావడం వల్లనే ఒక్క కాగితంమీద వ్రాయవలసిందన్నాడు. ఆ కాగితాలమీద సంతకం పెట్టి తనకు చెప్పిన పక్షంలో మిగతావన్నీ ఆవిధంగా వ్రాసి ఉండునని చెప్పాడు మూర్తి.

తన్ను ధిక్కరించే ధైర్యం ఎక్కడిదని గదిమాడు ఆఫీసర్.

ధిక్కరణ కాదనీ, తను చేసిన పని సరైనదేననీ జవాబిచ్చాడు మూర్తి. ఆగ్రహంతో గుడ్లురిమి, ప్రళయ రూపందాల్చి, ధిక్కరణ పొందడంవల్ల కలిగిన కోపావేశంతో మూర్తిని కొట్టడానికి చెయ్యెత్తాడు ఆఫీసర్.

నిశ్చలంగా కొట్టమన్నాడు మూర్తి.

చెయ్యి దించి, బర్రున కుర్చీ వెనక్కి నెట్టి దిగ్గున లేచి. కోటు భుజాన తగిలించుకుని, యింటికి పోయాడు ఆఫీసర్. ఇంతసేపూ ఈ గొడవ వింటున్న గుమస్తాలు ఆఫీసర్ వెళ్ళగానే ఊపిరి తిప్పుకున్నారు.

గుమస్తాల కూటం ఆఫీసర్ యింటికి చేరి మూర్తిమీదనూరిపోశారు. ఇలా తిరగబడే గుమస్తాలను శిక్షించని పక్షంలో ఆఫీస్ నాశనమై పోతుందన్నారు.

వాళ్ళ మాటలు ఆఫీసర్ మెదడులో బాగా చొచ్చుకున్నాయి. పైకివ్రాశాడు మూర్తిమీద. తను చేసిన న్యాయమైన పని న్యాయమని సమర్థించుకున్నందుకూ, తనమీద ఆరోపింపబడ్డ అన్యాయపు నేరాలు అక్రమమని అన్నందుకూ, మూర్తిని డిస్మిస్ చేసింది ప్రభుత్వం.